సమస్యలకు కేరాఫ్ వసతిగృహాలు



హిందూపురం ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహంలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు



రొళ్ల ఎస్సీ గురుకుల పాఠశాలకు కుళ్లిపోయిన కూరగాయలు సరఫరా చేసిన దృశ్యం



పెనుకొండ ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో తలుపులు లేని బాత్‌రూం

హిందూపురం టౌన్‌: ప్రభుత్వ వసతిగృహాలు సమస్యలకు కేరాఫ్‌గా మారాయి. వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. గదుల్లో పైకప్పు పెచ్చులూడుతూ, కిటికీలకు దోమతెరలు లేక డోర్లు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలికల కళాశాల వసతిగృహానికి సొంత భవనం లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. బీసీ బాలుర వసతి గృహంలో ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దానితో పాటు వసతిగృహం పక్కనే డ్రైనేజీ ఉండడం వల్ల విద్యార్థులు తరచూ జ్వరాల బారినపడుతున్నారు. వసతిగృహాల్లో మంచాలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. భోజనానికి పెద్ద బియ్యం వాడుతున్నట్లు విద్యార్థులు వాపోయారు.

లేపాక్షి: మండల కేంద్రంలో బీసీ బాలికల హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగా లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయితీ నుంచి వచ్చే పైపులైన్ వద్ద ఓ రైతు సమస్య సృష్టిస్తున్నట్లు విద్యార్థినులు చెబుతున్నారు. బీసీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా వుంది. రాత్రిపూట పిల్లలు మరుగుదొడ్డికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యార్థులు నల్లబండ్ల మీదే పడుకుంటున్నారు. ఊరికి దూరంగా ఉండడంతో రాత్రిపూట విషపురుగులతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మడకశిరరూరల్‌: మండలంలోని కల్లుమర్రి బీసీ, నీలకంఠాపురం ఎస్సీ బాలుర వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లుమర్రి బీసీ హాస్టల్‌లో 75 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు అనుగుణంగా గదులున్నా కిటికీలకు మెష్‌ లేకపోవడంతో రాత్రి సమయంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటి వరకు విద్యార్థులకు బెడ్‌షీట్లు అందించలేదు. స్నానం చేయడానికి వేడి నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. మంచాలు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. నీలకంఠాపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో 206 మంది విద్యార్థులు ఉండగా.. బెడ్‌షీట్లు పంపిణీ చేయలేదు. ఈ హాస్టల్‌లో విద్యార్థులకు మంచాల సౌకర్యం లేక నేలపైనే నిద్రిస్తున్నారు. గుండుమల బీసీ గురుకుల బాలుర వసతి గృహంలో 520 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గదుల సమస్య ఉంది.

పెనుకొండ/రొద్దం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారు.. కార్పొరేట్‌ స్థాయిలో విద్యనందించేందుకు కృషి చేశారు. సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించారు. వసతి గృహాల మరమ్మతులు చేయించి, ఏటా విద్యార్థులకు సరిపడా దుప్పట్లు అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సంక్షేమ హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. సరిపడా బెడ్‌షీట్లు అందించలేదు. సరైన బాత్‌రూములు లేక ఆరు బయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి. నాణ్యమైన భోజనం అందించలేదు.. పెనుకొండ నియోజకవర్గం రొద్దం ఎంజేపీ–2 ఏపీ బీసీడబ్ల్యూ గురుకుల పాఠశాలలో మొత్తం 5వతరగతి నుంచి, పదోతరగతి వరకు చదువుతున్నారు.రొద్దం ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు నూతన భవనాలు నిర్మించకపోవడంతో షిర్డీసాయి కళ్యాణ మంటపంలో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవు. 250 మందికి 25 బాత్‌రూములే ఉన్నాయి. ఆరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి. కొన్ని బాత్‌రూములకు తలుపులు లేవు. కొందరికే దుప్పట్లు సరఫరా చేశారు. మిగిలిన వారికి ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. నేలపైనే నిద్రించాలి. నేలపైనే కూర్చొని గ్రూప్‌ స్టడీ చేయాల్సి వస్తోంది. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా వదిలేసిన నీటి తొట్టెలు ఉన్నాయి.

గుడిబండ: రాళ్లపల్లి, మండలపల్లి బాలుర వసతి గృహం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాళ్లపల్లి వసతి గృహంలో కిటికీలకు మెష్‌ లేదు. మరుగుదొడ్లు లేక పిల్లలు కాలకృత్యాల కోసం పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. స్నానాలు ఆరుబయట చేస్తున్నారు.

ముద్దగా ఉన్న అన్నమే భోజనం..

రొళ్ల: మండలంలోని దొమ్మరహట్టి గ్రామ సమీపాన ఉన్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ బాలుర రెసిడెన్షియల్‌ పాఠశాలలో 560 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అన్నం ముద్దగా ఉండటంతో తినలేకపోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. ఆకుకూరలు, కూరగాయలు కుళ్లిపోయాయి. రాత్రి సమయంలో మంచాలు లేకపోవడంతో నేలపైనే పడుకుంటున్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా గదులు లేక పోవడంతో చాలా మంది విద్యార్థులు రాత్రిపూట వరండాలో నిద్రిస్తున్నారు. మొత్తం 110 మంది విద్యార్థులు 5 నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఈ వసతి గృహంలో 100 మందికి ఆరు మరుగుదొడ్లు, ఆరు స్నానపు గదులు ఉన్నాయి. పరిశుభ్రత లేక పోవడంతో అధ్వానంగా ఉన్నాయి. ప్రభుత్వం బెడ్‌షీట్లు సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి దుప్పటి, చాపలు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం ఇంత వరకు విద్యార్థులకు దుప్పటి, జంకానా తదితర వస్తువులు ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

లేపాక్షిని సందర్శించిన గవర్నర్‌ ప్రైవేట్‌ కార్యదర్శి



ఫంకజ్‌కుమార్‌ దంపతులను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్‌ కరణం రమానందన్‌

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయాన్ని కర్ణాటక గవర్నర్‌ ప్రైవేటు కార్యదర్శి ఫంకజ్‌కుమార్‌ మెహతాతో పాటు అతని కుటుంబ సభ్యులు శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్‌ కరణం రమానందన్‌ స్వాగతం పలికారు. ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్ర స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వున్న శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా పీయూ, పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన 30 మంది వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. శనివారం తుమకూరులోని గుబ్బి వీరణ్ణ కళాక్షేత్రంలో జిల్లా వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమంలో సహకార శాఖా మంత్రి కేఎన్‌ రాజణ్ణ సతీమణి శాంతమ్మ మాట్లాడారు. వాల్మీకులే కాకుండా ఇతర సామాజిక వర్గాల విద్యార్థులు సైతం బాగా చదువు కుని ఉన్నత స్థానాల్లో రాణించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో జిల్లా వాల్మీకి సంఘం నాయకులు, తాలూకా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, పీడబ్ల్యూడీ ఏఈఈ అనిల్‌ కుమార్‌, లోకేశ్‌ పాళేగార్‌, ఓంకార నాయక, భాస్కర నాయక, బెళ్ళిబట్లు బలరాం , అనంతయ్య మదకరి నాయక, నరసింహ నాయక తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌ దర్శన్‌ స్పెషల్‌ సర్వీస్‌ ప్రారంభం

హిందూపురం: స్థానిక ఆర్టీటీ బస్టాండులో శనివారం హనుమాన్‌ దర్శన్‌ స్పెషల్‌ సర్వీస్‌ను డీఎం శ్రీకాంత్‌ ప్రారంభించారు. హనుమాన్‌ దర్శన్‌ కింద హిందూపురం నుంచి మురడీ, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకోవచ్చని డీఎం తెలిపారు. పెద్దలు ఒకరికి రూ.710, పిల్లలకు రూ.380 చార్జ్‌ వసూలు చేస్తున్నామన్నారు.

సత్యసాయి రథోత్సవం



లేపాక్షిలో రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

లేపాక్షి: సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం లేపాక్షిలో సత్యసాయి ప్రేమ వాహిని దివ్య రథయాత్ర జరిగింది. నవోదయ విద్యాలయం నుంచి ప్రారంభమైన యాత్రలో పురవీధుల్లో సాగింది. తహసీల్దార్‌ సౌజన్యలక్ష్మి, ఏఎస్‌ఐ నారాయణ స్వామి, లేపాక్షి, మల్లిరెడ్డిపల్లి, వెంకటాపురం, బసవనపల్లి, మామిడిమాకులపల్లి, మానేపల్లి సత్యసాయి భజన మందిరాల సభ్యులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల కేంద్రంలో సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి శోభాయాత్రను నిర్వహించారు. శోభాయాత్ర రథం చిలమత్తూరు నుంచి గోరంట్లకు మధ్యాహ్నం చేరుకుంది. భక్తులు సత్యసాయి భజనమండలి సభ్యులు రథాన్ని పట్టణ వీధుల్లో ఊరేగించారు.

హొన్నంపల్లిలో చోరీ

పరిగి: హొన్నంపల్లిలో శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ రంగడుయాదవ్‌ తెలిపిన మేరకు.. శ్రీనివాసరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 22న తీర్థ యాత్రకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకుని చూడగా, చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. బీరువాలో దాచిన రూ. 45 వేల నగదుతో పాటు వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన శ్రీనివాసరెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రొద్దం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజులవాణి

రొద్దం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ మంజుల వాణి శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించి, ఓపీ, శుభ్రతపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై డాక్టర్‌ సోమశేఖర్‌రెడ్డితో అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌ఎన్‌ఓ పోస్టు ఖాళీ ఉందని, మందుల కొరత ఉందని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.గత ప్రభుత్వంలో ప్రారంభించిన 20 పడకల ఆస్పత్రి పనులు పూర్తి చేయాలని కోరారు.

తూతూమంత్రంగా మండల మీట్‌



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న దృశ్యం

అగళి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు, ఎంపీటీసీలు వచ్చినా నామమాత్రంగా సంతకాలు చేసి వెళ్లిపోయారు. ఉన్నవారితో నామమాత్రంగా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చకచక చదివి వినిపించారు. వాటిపై పెద్దగా చర్చ జరగకపోవడంతో సమావేశాన్ని కూటమి సమావేశంగా మార్చేశారు. మండలంలో రెండు సంవత్సరాలుగా ఏఈ పోస్టు ఖాళీగా ఉంది.. ఎప్పుడు భర్తీ చేస్తారని విద్యుత్‌ శాఖ ఏడీ రఘును సర్పంచ్‌ ముద్దరాజు ప్రశ్నించారు. రైతులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ ,తహసీల్దార్‌ సుబ్బారావు ఎంఈఓ చంద్రశేఖర్‌ నాయుడు, ఏపీఓ మంజునాథ్‌, ఏఓ నాగరాజు ,ఎంపీటీసీలు,సర్పంచ్లు,మండలం అధికారులు పాల్గొన్నారు.

కందుల పంపిణీ

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి రైతు భరోసా (రైతు సేవా కేంద్రం)లో శనివారం రైతులకు విత్తన కందుల పంపిణీ చేశారు. కందులు సాగు చేయడానికి ఇప్పుడు అనువుగా ఉంటుందని వీఏఏ నాగభూషణ అన్నారు. ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప



హేమావతిలో మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప



అగళి: క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు



రొళ్ల: మాట్లాడుతున్న మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు

అమరాపురం: ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం. ఆయన చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్‌ గంగుల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని హేమావతి, ఆలదపల్లి గ్రామాల్లో మండల కన్వీనర్‌ త్రిలోక్‌నాథ్‌, ఎంపీపీ ఈరన్న, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్‌, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా హామీలు ఇచ్చారన్నారు. అయితే వాటిని అమలు చేయకుండా ప్రజలకు దగా చేస్తున్నారని మండిపడ్డారు. 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్‌, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం తదితర హామీల ఊసే లేదన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం పని చేయాలన్నారు. జగనన్న సైనికులుగా జగనన్నను రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం చేయడమే ధ్యేయంగా పని చేద్దామని తెలిపారు. గ్రామంలో పార్టీ అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను క్యూఆర్‌ కోడ్‌ ద్వారా వివరించాలని సూచించారు. 2019 ఎన్నికల్లో పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ బడిలోనే ఇంగ్లిష్‌ మీడియం ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్‌ కోడ్‌ విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శేషాద్రి, మడకశిర నియోజవర్గం ఎస్సీ, బీసీ సెల్‌ అధ్యక్షుడు శివన్న, శివకుమార్‌, మాజీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గగన, వైస్‌ ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీలు, కెంచప్ప, నారాయణ సర్పంచ్‌ గిరిజమ్మ,, సీనియర్‌ నాయకులు నాపగరాజు, నారాయణప్ప, గోవింద రాయ, మంజునాథ, నరసింహ రాజు, సురేష్‌ కుమార్‌, మంజునాథ, రవి కుమార్‌ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలే

అగళి: వైఎస్సార్‌సీపీ హయంలోనే అభివృద్ధి, సంక్షేమం జరిగింది. కూటమి ప్రభుత్వం అబద్ధాలు చెబుతూ మోసం చేస్తోందని పార్టీ మండల పరిశీలకులు సాయి లీల విమర్శించారు. శనివారం కోడిపల్లి, ఇరిగేపల్లి అగళి పంచాయతీల్లో మండల కన్వీనర్‌ స్టుడియో శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. ఉచిత బస్సు సదుపాయం ఎప్పుడు కల్పిస్తారో స్పష్టత లేదన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ నాయకులు సైనికుల్లా పని చేయాలని కొరారు. అనంతరం పంచాయతీ పరిశీలకులుగా కొడిపల్లి పంచాయతీకి నాగరాజు, ఇరిగేపల్లి,అగళి పంచాయతీలకు తిమ్మరాయప్పను నియమించారు. కార్యక్రమంలో బీసీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచ్‌ ముద్దరాజు రామకృష్ణప్ప, నాయకులు సతీష్‌, హనుమంతరాయప్ప, సదానంద, ఆరాధ్య, ఈరన్న, నాగరాజు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

రొళ్ల: గ్రామ కమిటీల ద్వారా వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి తదితరులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొడ్డేరి, ఎం.రాయాపురం, హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్‌ నరసింహారెడ్డి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్‌ సిక్స్‌ హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసగించిందని ఆరోపించారు. 14 నెలల కాలంలోనే కూటమి నాయకులు ఏకంగా రూ.1.79 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఆరాచక పాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులను కూటమి నాయకులు ఇబ్బందులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్‌ రఘువీర్‌, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు నాగేంద్ర, విజయరంగేగౌడ, మాజీ సింగిల్‌ విండో అధ్యక్షుడు సంతోష్‌, మహిళ నాయకురాలు అంజలి, సర్పంచులు అనిత, ప్రకాష్‌, నరసింహప్ప, వైస్‌ సర్పంచ్‌ సీఎం ఘట్ట రవి, ఎంపీటీసీలు శివన్న, నాగరాజు, గోవింద రాజు, గంగాధర్‌, శివకుమార్‌ నాయక్‌, మాజీ మార్కెట్‌ యార్డు డైరెక్టర్‌ శ్రీనివాస్‌, మాజీ ఎంపీటీసీ శివన్న, వార్డు మెంబర్‌ వజీర్‌షేక్‌, నాయకులు మారేగౌడు, భీమన్న, చిరంజీవి, ఈరన్న, మధు, యరగుంటప్ప, సురేష్‌, నగేష్‌, సోమశేఖర్‌, దయానంద్‌, వివిధ పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌ పేరుతో చంద్రబాబు వంచన



కల్లూరులో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న టీఎన్‌ దీపిక

లేపాక్షి: సూపర్‌ సిక్స్‌ పేరుతో సీఎం చంద్రబాబు ప్రజలను నిలువునా మోసగించారని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్‌ దీపిక మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నిస్సార్‌ ఆధ్వర్యంలో శనివారం కొండూరు, కల్లూరు, మానేపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఎన్నికల హామీల ఊసే ఎత్తడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలు అమలును పట్టించుకోవడం లేదన్నారు. పథకాల అమలుపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శిరివరం సర్పంచ్‌ నేత్రావతి, కోఆప్షన్‌ సభ్యుడు బషీర్‌, నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, మల్లన్న, చలపతి, శ్రీనివాసులు, నరసింహప్ప, నాగిరెడ్డి, చెన్నకేశవ, రవీంద్రరెడ్డి, మానేపల్లి రామాంజినేయులు, రవి, నరేష్‌, మూర్తి, సోము, గంగాధర్‌, శివ, విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు మడకశిరలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ

మడకశిర: పట్టణంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌ వాల్మీకి సతీష్‌ కుమార్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం రోడ్డులో ఉన్న శ్రీసరస్వతీ విద్యామందిరం ఆవరణలో ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జాయింట్‌ సెక్రటరీ భారతిరెడ్డిదేశాయ్‌ హాజరవుతారన్నారు. పట్టణ పరిధిలోని 4, 5, 6, 17వ వార్డులకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుడిబండ మండలంలో..

గుడిబండ: మండలంలోని పిసి గిరి, దేవరహట్టి, కరికెర గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ డీఎల్‌ యంజారేగౌడు ఓ ప్రకటనలో తెలిపారు. పీసీ గ్రామంలో ఉదయం 10 గంటలకు, దేవరహట్టి గ్రామంలో మధ్యాహ్నం 1 గంటకు, కరికెర గ్రామంలో 3 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



మహిళలతో కలిసి కలశ పూజలో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అల్లూరి యువసేన, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్‌ పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. తొలుత గోపూజ చేసి మహిళలతో కలిసి కళశాలను మోశారు. అనంతరం స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆమెను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నరసింహమూర్తి, గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. నేడు స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం ప్రాణ ప్రతిష్ట చేయనున్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

హిందూపురం టౌన్‌: రహమత్‌పురంలోని రైల్వేస్టేషన్‌ సర్కిల్‌ వద్దనున్న అమరవీరుల స్థూపం వద్ద శనివారం రాత్రి కార్గిల్‌ యుద్ధభూమిలో మరణించిన అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన సైనికులను స్మరించుకోవడం దేశపౌరుల బాధ్యత అని వారు పేర్కొన్నారు. లైఫ్‌ వరల్డ్‌ ఉదయ్‌ కుమార్‌, శ్రీరాములు, మింటూ, సుభాష్‌ గాంధీ, అబ్రహం, నారాయణ, బండ్లపల్లి బాబా, చంద్ర పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు

మడకశిర: బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి కోరారు. శనివారం మండల పరిషత్‌ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మిషన్‌ వాత్సల్య పథకంలో భాగంగా బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు, బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ కమిటీల సభ్యులు బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాల న్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన, బాలల పరిరక్షణకు సంబంధించిన వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల పరిరక్షణ శాఖ అధికారులు మురళి, నాగలక్ష్మి, మున్సిపల్‌ కమిషనర్‌ జగన్నాథ్‌, ఏఎస్‌ఐ ముత్యాలప్ప, ఏపీఎం నాగేశ్వరి, నాగమణి పాల్గొన్నారు.

యువకుడిని ఢీకొన్న బస్సు

మడకశిరరూరల్‌: గౌరిపురం వద్ద శనివారం ద్విచక్ర వాహనాన్ని కేఎస్‌ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమిదాలగొందికి చెందిన నరసింహమూర్తి (అలియాస్‌ పండు) పావగడ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. పెట్రోల్‌ కోసం రోడ్డు దాటుతుండగా బెంగళూరుకు వెళ్తున్న కేఎస్‌ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

శ్రావణ మాస పూజలు



అమరాపురంలో శనీశ్వరస్వామికి పూజలు



కోదండరామమూర్తిగా పేట వెంకటరమణస్వామి

మడకశిర: పట్టణంలో తొలి శ్రావణ శనివారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. షిరిడీ సాయిబాబా, మిట్టబండ ఆంజనేయస్వామి, కరిబసవేశ్వర, ఒడిశలమ్మ, వేంకటేశ్వర స్వామి, కన్యకాపరమేశ్వరి, చంద్రమౌళీశ్వర, భోగిరామేశ్వర తదితర ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ప్రధానంగా శనేశ్వరస్వామి ఆలయాల్లో మూల విరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శనీశ్వరుడికి పూజలు

అమరాపురం: మండలంలోని వివిధ ఆలయాల్లో శ్రావణమాసం మొదటి శనివారం పూజలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. అమరాపురం, హెచ్‌బీఎస్‌. కాలనీ, ఆలదపల్లి తదితర గ్రామాల్లో వెలసిన శనీశ్వరస్వామికి అర్చకులు సుప్రభాతసేవ, తైలాభిషేకం, నవగ్రహ పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు.

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిగ్రహానికి అభిషేకం చేశారు. వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళ హారతి ఇచ్చారు.

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో స్వామి శనివారం కోదండరామమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం కోదండరామమూర్తిగా అలంకరించి పూజలు చేపట్టారు. డీఆర్‌కాలనీలో శనేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌ శనేశ్వర స్వామి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ముదిరెడ్డిపల్లిలోని రుక్మిణి పాండురంగ ఆలయంలో స్వామి విశేష పూజలు చేపట్టారు.

సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామిని శనివారం మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర బీసీ సెల్‌ విభాగం ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు, ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈరలక్కప్పను అర్చకులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ క్రిష్ణమూర్తి, మండల కన్వీనర్‌ త్రిలోక్‌నాథ్‌, మాజీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గగన, మాజీ ఆలయ కమిటీ చైర్మెన్లు గోవిందరాయ, మంజునాథ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్‌: శ్రావణ మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని పెద్ద చెరువుకట్ట ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి ఆకుపూజ,కుంకుమ అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు.

మడకశిర రూరల్‌: మండల పరిధిలోని జమ్మానిపల్లి గ్రామ మధ్యలో వెలసిన బొడ్రాయికి శనివారం మహిళలు, రైతులు 108 బిందెలతో జలాభిషేకం చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండి.. పంటలు పండాలని బొడ్రాయికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు.